# వరంగల్ వాయిస్

Evening Daily

www.warangalvoice.net

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 310 | బుధవారం | 26 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎంపీ కడియం కావ్య

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షిని, పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులను ఢిల్లీలో కుటుంబ సమేతంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిశారు. - వరంగల్ వాయిస్, ఢిల్లీ



## ఆషాఢమాస బోనాల ఏర్పాట్లపై సమీక్ష

ఆషాఢమాస బోనాల ఏర్పాట్లపై దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో బేగంపేటలోని హరిత ప్లాజాలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంత్ రావు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది, తదితరులు హాజరయ్యారు.- వరంగల్ వాయిస్, హైదరాబాద్



## ముగిసిన ప్రెస్ క్లబ్ క్రీడోత్సవాలు

- ఉత్కంఠభరితంగా క్రికెట్ ఫైనల్ మ్యాచ్
- విజేతగా నిలిచిన కెమెరామెన్స్-XI జట్టు

8 లో..



## యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్

- మాదక ద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేయాలి
- అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

2 లో..



# ప్రైవేట్ దోపిడీ

- 30 నుంచి 50 శాతం పెరిగిన ఫీజులు
- ఇష్టారాజ్యంగా ప్రైవేట్ స్కూళ్ల తీరు
- ఆందోళనల బాటపట్టిన విద్యార్థి సంఘాలు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

## నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు

తమ పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు ఎంతైన ఖర్చు చేస్తారన్న బలహీనతను ప్రైవేట్ పాఠశాల యజమానులు ఆసరాగా తీసుకుంటున్నారు. ఫీజులు ఎంత పెంచినా అడిగేవారుండరని ఇష్టారీతిగా పెంచుతున్నారు. పాఠశాలలో టెక్నో, డీజీ, ఐపీఎస్, బిజినెస్ స్కూల్ అనే పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను గారడీ చేస్తూ.. ఆకట్టుకుంటున్నారు. తమ పాఠశాలలో మెరుగైన వసతులు ఉన్నాయని, రంగు రంగుల కర పత్రాలు ముద్రించి ప్రచారం చేస్తున్నారు. ప్రతీ ప్రైవేట్ పాఠశాలలో 30 నుంచి 50శాతం ఫీజులు పెంచుతున్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజులు, డొనేషన్ల దోపిడీకి అంతేలేకుండా పోతుంది. ఈ నేపథ్యంలో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల కట్టడిపై ప్రభుత్వం మాట కూడా ఎత్తడం లేదు. దీంతో ఫీజుల మోతతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్




వివరాలు 2లో..

# ప్రైవేట్ దోపిడీ

**నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు**

**30 నుంచి 50 శాతం పెరిగిన ఫీజులు**

**ఇష్టారాజ్యంగా ప్రైవేట్ స్కూళ్ల తీరు**

**ఆందోళనల బాటపట్టిన విద్యార్థి సంఘాలు**

**పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు**







రాష్ట్రంలో 11,051 వరకు కార్పొరేట్ ప్రైవేటు స్కూల్స్ ఉండగా, వీటిలో 32 లక్షల మంది చదువుతున్నారు. బడ్జెట్ ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు కొంత తక్కువగానే ఉండగా మిగిలిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో మాత్రం భారీగానే వసూలు చేస్తున్నారు. ఒక్కో స్కూల్లో క్లాసును బట్టి రూ. 50 వేల నుంచి రూ. 5 లక్షల వరకు యాజమాన్యం ఫీజులు వసూలు చేస్తోంది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు బడులు విద్యార్థుల చదువును సంతలో సరుకుగా మార్చేశాయి. స్కూళ్లు ప్రారంభం కావడంతో అడ్మిషన్ తీసుకోవాలంటే డొనేషన్లని, బుక్స్‌కు సపరేట్ అని, యూనిఫామ్‌కు సపరేట్ అని, ఐఐటీ ఫౌండేషన్ అయితే సపరేట్, బస్సు ఫీజు సపరేటు అని ఇలా రకరకాల పేర్లతో పాఠశాలల యాజమాన్యాలు అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారు. తమ పిల్లలను ఉన్నతమైన, నాణ్యమైన చదువులను చదివించాలని తల్లిదండ్రుల కార్పొరేట్ మోజులో పడ్డారు. దీంతో ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి అక్రమ వసూళ్లకు విద్యాసంస్థలు తెర తీశాయి.

## నియంత్రణ ఏదీ..?

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు వేయికి పైగా ఉన్నాయి. వీటిలో విద్యా వ్యాపారం అడ్డూ అదుపు లేకుండా పోతోంది. స్టేట్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ తదితర బోర్డుల పేరిట ఫీజుల దోపిడీ యథేచ్ఛగా జరుగుతున్నా పర్యవేక్షణ గానీ, నియంత్రణ గానీ మచ్చుకైనా కనిపించడం లేదు. నాణ్యమైన విద్యాబోధన, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని నమ్మబలుకుతూ గత ఏడాది కంటే యాభై నుంచి నూరు శాతం వరకు ఎక్కువగా ఫీజులను వసూలు చేసే ప్రణాళికలను యాజామాన్యాలు అమలు చేస్తున్నాయి. అయితే ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ తమ పరిధిలో లేదంటూ విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఫీజుల వ్యవహారమంతా ఆయా స్కూళ్ల గవర్నింగ్ బాడీ చూసుకుంటుందని సమాధానమిస్తున్నారు.

## గవర్నింగ్ కౌన్సిల్ జాడేదీ..?

కేసీఆర్ సర్కారు స్కూల్ ఫీజులను ఖరారు చేసే అధికారాన్ని గవర్నింగ్ బాడీకి అప్పగించి స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఆరుగురు సభ్యులు ఈ బాడీలో ఉంటారని అప్పట్లో స్పష్టం చేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలని ఏడాది కాలంలో విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీ స్ట్రక్చర్‌ను ఖరారు చేస్తుందని అప్పట్లో వెల్లడించింది. ఈ కమిటీలో పాఠశాల కరస్పాండెంట్, పేరెంట్ టీచర్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీచర్ ప్రతినిధి, డీఈవో ప్రతినిధి, తల్లిదండ్రుల ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఖరారు చేసిన ఫీజులను వెబ్‌సైట్, నోటీసు బోర్డుల్లో పొందుపరచాలి. కానీ ఇదంతా పేరుకు మాత్రం విద్యా సంస్థలు యాజమాన్యాలు ఎలాంటి సంప్రదింపులు జరపకుండా అడ్డగోలుగా ఫీజులు పెంచుతున్నారు. దీంతో సామాన్యులపై మోయలేని భారం పడుతోంది.

## తల్లిదండ్రులపై పెను భారం..

ఇష్టానుసారంగా పెంచుతున్న ఫీజులతో తల్లిదండ్రులపై విపరీతమైన భారం పడుతోంది. ఫీజులపై ఎవరికీ ఫిర్యాదు చేయాలి? ఎలా ఫిర్యాదు చేయాలో కూడా పేరెంట్స్‌కు తెలియడం లేదు. ఏ స్కూళ్లలో కూడా లాటరీ సిస్టం పెట్టడం లేదు. ఇంతమంది పేదలకు నిబంధనల ప్రకారం ఉచితంగా అడ్మిషన్లు ఇచ్చామని ప్రకటించడం లేదు. కనీసం నోటీసు బోర్డు కూడా పెట్టడం లేదు. ప్రైవేటు స్కూళ్లను కట్టడి చేయకపోతే విద్య అనేది అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉంది. ప్రభుత్వం స్పందించి నిబంధనలు పాటించని స్కూళ్ల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు సైతం చేస్తున్నాయి. అయినా ప్రభుత్వానికి చలనం లేకుండా పోతుంది. ప్రభుత్వం నిబంధనలు కేవలం జీవోలకే పరిమితం అవుతున్నాయి. దాని అమలుపై ప్రభుత్వం కానీ, అధికారులు కానీ, చిత్తశుద్ధి చూపడం లేదు. దీంతో ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.

## నిబంధనలకు తూట్లు..!

ప్రైవేటు స్కూళ్ల పర్యవేక్షణ, ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం 1994లో జీవో నంబర్ 1 జారీ చేసింది. కానీ ఈ జీఓను అటు అధికారులు, ఇటు యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ఇందులోని 12వ నిబంధన ప్రకారం ప్రతి ప్రైవేటు విద్యా సంస్థ తమ వార్షికాదాయ వ్యయాలను ఆడిట్ చేయించాలి. అనంతరం ఆ రిపోర్టును ప్రభుత్వానికి సమర్పించాలి. కానీ ఒక్క ప్రైవేటు పాఠశాల కూడా అలా చేయడం లేదు. అంతేకాదు మొత్తం వార్షికాదాయంలో స్కూల్ సిబ్బంది జీతాలు, ఫర్నీచర్, అభివృద్ధి ఖర్చు పోగా, మిగిలిన దానిలో కేవలం 5 శాతాన్నే లాభంగా తీసుకోవాలి. కానీ వాస్తవానికి ఈ నిబంధన ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. జీవో నెంబర్ 1ను పక్కాగా అమలు చేయాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం 2007లో జీఓ నంబర్ 2ను విడుదల చేసింది. ఇందులో భాగంగా ఫీజులపై చర్చించి ఖరారు చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేశారు. అది కూడా ఇప్పుడు కనుమరుగైంది. జీవో 88 ప్రకారం 250 మంది విద్యార్థులు చదివే పాఠశాలలో 700 చదరపు మీటర్ల విస్తీర్ణంలో క్రీడా మైదానం ఉండాలి. అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రతి కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేటాయించి ఉచిత విద్యను అందించాల్సి ఉంటుంది. కానీ ఏ ఒక్క స్కూలు కూడా ఈ నిబంధనలు పాటించడం లేదు. ఇరుకు గదుల్లో, చుట్టూ వాహనం తిరిగే స్థలం లేని భవనాల్లో స్కూళ్లను ఇష్టానుసారంగా నడిపిస్తున్నారు.

# యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్

**మాదక ద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేయాలి**

**అదనపు కలెక్టర్ రాధిక గుప్తా**




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాదక ద్రవ్యాల దుర్వినియోగంతో యువత భవిత నిర్వీర్యం అవుతందని అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా మహిళలు పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం అదాలత్ ట్రాఫిక్ కూడలిలో నిర్వహించి మత్తు పదార్థాల దుర్వినియోగం పర్యవసానాలపై అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టరెట్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ నేడు మాదకద్రవ్యాలు చాక్లెట్, బిస్కట్ రూపంలో పాఠశాల కళాశాల సమీపంలోని షాపుల్లో అమ్మటం లాంటి అనేక సంఘటనలు చోటు చేసుకున్నాయని ఆవేదన వ్యకం చేశారు. వీటి పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అప్రమత్తం చేయాలన్నారు. అడిషనల్ డీసీపీ రవి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణాపై పోలీస్ వ్యవస్థ అప్రమత్తంగా ఉందని, మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణాపై సమాచారం ఉంటే పోలీస్ శాఖకు తెలియచేయాలని టాస్క్ ఫోర్స్, నార్కోటిక్ విభాగం చర్యలు తీసుకుంటారని అన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ బి.సాంబశివ రావు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో జిల్లా యాక్షన్ ప్లాన్ ప్రకారం జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థినీ విద్యార్థులను ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. జిల్లా సంక్షేమ అధికారి కే మధురిమ మాట్లాడుతూ మహిళా శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతి కార్యక్రమంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక వర్గ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు దుర్వినియోగం, అక్రమ రవాణాపై నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సురేష్, జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి చంద్రశేఖర్, ఏసీపీలు కొత్త దేవేందర్ రెడ్డి, తిరుమల్ రావు, నందిరాం నాయక్, సీఐలు దుర్గా భవాని, సత్యనారాయణ, డి.సురేష్, రవికుమార్, డిప్యూటీ డీఎంహెచ్ ఓ డాక్టర్ యాకుబ్ పాషా, డెమో వి.అశోక్ రెడ్డి, డాక్టర్ ఉమశ్రీ, డాక్టర్ ప్రహసిత్, డాక్టర్ అహ్మద్, డీపీవో ముంజం రాజు, జేజేబీ సభ్యులు మెరుగు సుభాష్, సూపరింటెండెంట్ జి.లక్ష్మికాంత్ రెడ్డి, ఇంచార్జి డీసీపీవో ఎస్.ప్రవీణ్ కుమార్, హెల్పింగ్ హ్యాండ్ సంస్థ కార్యదర్శి రాము, ఎఫ్ఆర్వో రవి క్రిష్ణ, ప్రొఫెసర్ రవి కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ ఎస్ భాస్కర్, అంగన్వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. కాగా కార్యక్రమం అనంతరం మానవ హారం నిర్వహించి ప్రతిజ్ఞ చేసి, మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై దిష్టి బొమ్మ దహనం చేయడం జరిగింది.

# మరణించిన జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు

## మీడియా అకాడమీ చేయూత

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మరణించిన జర్నలిస్టుల కుటుంబాల పిల్లలకు చేయూ తను అందించేందుకు తెలంగాణ మీడియా అకాడమీ ముందుకొచ్చిందని మీడియా అకాడమీ కార్యదర్శి ఎస్ వెంకటేశ్వర రావు బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాల పిల్లలకు ప్రతినెల రూ.1000 చొప్పున ట్యూషన్ ఫీజు చెల్లించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరానికి (2024-25) సంబంధించి బోనఫైడ్ సర్టిఫికెట్ల వివరాలతో ఈ నెల 28 లోపు సెక్రటరీ తెలంగాణ మీడియా అకాడమీ ఇంటి నెంబర్ 5-9-166 చాపల్ రోడ్డు, నాంపల్లి, హైదరాబాద్ 500001 చిరునామాకు రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కాబట్టి, మరణించిన కుటుంబాల జర్నలిస్టుల పిల్లల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ధరలకు హద్దు లేదు.. కేంద్రానికి బుద్ధి లేదు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం హసన్ పర్తి మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీకేఎంయూ జాతీయ నాయకుడు మోతే లింగారెడ్డి హాజరై మాట్లాడుతూ పెరిగే ధరలకు హద్దు లేదు.. కేంద్ర పాలకులకు బుద్ధి లేదని ఎద్దేవా చేశారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు, దినదినం ఆకాశాన్ని అంటుతున్న ధరలను వీటిని భూమార్గం పట్టించే ప్రజాస్వామిక ఉద్యమాలు విజయవంతం కావాలని, ఈ పోరాటాలలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైతు పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వకుండా అటు రైతాంగాన్ని, కారు చౌకగా అమ్ముకున్న ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్ చేస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తూ ధరలు పెంచి ప్రజల్ని దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలను తగ్గించకుంటే పాలకులు గద్దె దిగి పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి నేదునూరి రాజమౌళి, హసన్ పర్తి మండల సీపీఐ కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, భారత్ బచావో నాయకులు దొమ్మాటి ప్రవీణ్ కుమార్, వాస్కుల భరత్, మండవ సుబ్బయ్య పల్లి, గోపు బుచ్చిరెడ్డి, ఎర్ర నాగరాజ్, ఎర్ర కుమారస్వామి, నేదునూరి రామచంద్ర, మెట్టు జక్కిరెడ్డి, ఎల్లాపూర్, వంగపాడు నుంచి దోమ మధున, జ్యోతి, ఏసోబు, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## జేడీ లక్ష్మీనారాయణను కలిసిన రాకేష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సీబీఐ మాజీ జేడీగా తెలుగు ప్రజలకు సుపరిచితులు, ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపిన జేడీ లక్ష్మీనారాయణను హైదారాబాద్ లోని వారి నివాసం లో బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గెలుపు ఓటములతో సంబంధం లేదని, రాజకీయాల్లో మనం ఆదర్శాలు నిలపాలని, దాని కోసం నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా జేడీ రాకేష్ రెడ్డితో అన్నారు. ఉన్నత విద్యావంతులు, నిజాయతీపరులు, యువకులు, యువ మేధావులు రాజకీయాల్లో ఉండాలని, అందుకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలు వేరైనా రాకేష్ రెడ్డి తనకు మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడతాం



**వరంగల్ వాయిస్, మామునూర్ :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వరంగల్ మామునూర్ నుంచి ఆర్టీవో కార్యాలయం వద్ద గల జ్యోతి బా పూలే తెలంగాణ బీసీ బాలుర సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల వరకు నిర్వహించిన ర్యాలీను అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ రవీందర్ లతో కలసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రగ్ దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జ్యోతి బాపూలే తెలంగాణ బీసీ బాలుర సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో “ సాక్ష్యం స్పష్టంగా ఉంది... నివారణ పెట్టుబడి” అనే అంశంపై జరిగిన సమావేశంలో కలెక్టర్ ప్రసంగించారు. జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, సంబంధిత శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై షీ టీమ్ అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళలపై జరిగే నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ ఇన్ స్పెక్టర్ సుజాత అన్నారు. హనుమకొండ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని దాదాపు 150 మంది విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ పై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థులు ఎవరి నుండైన ఇబ్బందులకు గురైనప్పుడు, ఎవరైనా అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా షీ టీమ్ వారికి సమాచారం ఇవ్వాలని, మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270కి ఫిర్యాదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి, చట్టరీత్యా చర్య తీసుకుంటామని అన్నారు. విద్యార్థులు సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని, అలా పంచుకోవడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలో నివారించవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ శారద మాట్లాడుతూ నేటి కాలంలో అమ్మాయిలు చాలా జాగ్రత్తగా ఉండాలని, ప్రయాణాలు చేసేటప్పుడు అపరిచిత వ్యక్తులతో ఎలాంటి విషయాలను, ఫోన్ నంబర్లను, ఫొటోలను షేర్ చేసుకోవద్దని, సోషల్ మీడియాలో పరిచయమైన వారితో ఎలాంటి వ్యక్తిగత విషయాలను షేర్ చేసుకోవద్దని, ప్రేమ పేరుతో వాళ్లు చెప్పే మాటలను నమ్మి తల్లిదండ్రులకు తెలుపకుండా తెలియని ప్రదేశాలకు వెళ్లకూడదన్నారు. షీ టీమ్ అసిస్టెంట్ సబ్ ఇన్ స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ బుచ్యానాయక్, డబ్ల్యూ పీఎస్‌పూర్ణ, కానిస్టేబుల్ రాంరెడ్డి పాల్గొన్నారు.



## పెరిగిన ధరలపై సీపీఐ నిరసన




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీపీఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా వరంగల్ మండల సమితి ఆధ్వర్యంలో పెంచిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో మండల కార్యదర్శి బుస్సా రవీందర్ ఆధ్వర్యంలో జరిగగా ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పాల్గొని మాట్లాడారు. దేశంలో పెంచిన నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించాలని కూరగాయలు, ఉప్పులు, పప్పులు, నూనె ధరలు ఆకాశానికి అంటుతున్నాయన్నారు. రెక్కాడితే డొక్కాడని నిరుపేదలు వాటిని కొనలేక పోతున్నారని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు, నిరసనలు, పోరాటాలకు శ్రీకారం చుడదామని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వరంగల్ మండల కార్యదర్శి బస్సా రవీందర్, సీపీఐ నాయకులు కాశీం పరికరాల రమేష్, జన్ను రవి, మేడిది అశోక్, తాళ్లపెల్లి రాయల, మహిళ సమైక్య జిల్లా కార్యదర్శి, మహిళా మండల కార్యదర్శి బచ్చల స్వప్న, కోయడ మనోహర్, బొల్లే సామిల్ రాజేష్, విక్టోరియా, రేణుక, నజీయా, వసంత లక్ష్మి , కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల తొర్రూరులో జరిగిన సమావేశానికి ప్రధానోపాధ్యాయుడు జై లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా స్థానిక కోర్టు జడ్జి మట్ట సరిత హాజరై మాట్లాడారు. ప్రస్తుత కాలంలో మాదకద్రవ్యాలు సామాన్య ప్రజలతో పాటు యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తూ యువత పెడదారిలో వెళ్లడానికి ప్రధాన కారణమవుతున్నాయన్నారు. వివిధ రకాల మాదకద్రవ్యాలను ఉపయోగించిన, సరఫరా చేసిన, ఇతరులు వాడడానికి ప్రోత్సహించిన కఠిన శిక్ష పడుతుందని తెలిపారు. ప్రారంభంలో సరదాగా వాడటం, స్నేహితుల ఒత్తిడి వల్ల వాడడం మొదలై వాటికి బానిసలవ్వడం జరుగుతుందన్నారు. మాదకదరావ్యాలు వాడకంతో అనేక ఘోరాలు సమాజంలో జరుగుతున్నాయని కాబట్టి, విద్యార్థులు వాటి ప్రభావానికి లోను కాకుండా చదువు మీద శ్రద్ధ వహించి ఉన్నత భవిష్యత్తును పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జి.రాము, ఎంఎన్ఓ ఎం.బుచ్చయ్య, తొర్రూరు లీగల్ సెల్ కమిటీ బృందం, పోలీస్ శాఖ వివిధ పాఠశాలల విద్యార్థులచే ర్యాలీ చేయించి మాదకద్రవ్యాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానికులు, యువకులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ విద్యాసంస్థల బంద్ విజయవంతం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని బుధవారం ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్ కు పిలుపు ఇవ్వడం జరిగింది. దీనిలో భాగంగా నేడు తొర్రూరు పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను బంద్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంగధారి సిద్దు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కారు విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపెడుతూ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు ప్రారంభమై పది నుంచి పదిహేను రోజులు పూర్తయిన ఇంత వరకూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించక పోవడం సిగ్గు చేటని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస, మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తూ విద్యా వ్యాపారాలకు పాల్పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలకు తొత్తులుగా మారి పరోక్షంగా వారికి సహకరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ పేదలకు ఉచిత విద్య అందకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో బుక్స్, స్టేషనరీ, యూనిఫాం, షూస్ పేర్లతో చేస్తున్న వ్యాపారాన్ని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస, మౌలిక సదుపాయాలు కల్పించాలని, మెగా డీఎస్సీ ద్వారా 25వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేదల కోసం 25 సీట్లు కేటాయించాలని, ఖాళీగా ఉన్న డీఈవో, ఎంఈవో పోస్టులు భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్, స్కావెంజర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మనోజ్, సాయి, రిత్విక్, రవి, సంతోష్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ములుగును మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో అందరి సహకారం అవసరమని, డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలకు యువత బానిసై జీవితాలను కోల్పోతున్న తరుణంలో మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల జరిగే నష్టాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ఏర్పాటు చేసిన ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, జిల్లా ఎస్పీ శబరీష్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, ఏఎస్పీ మహేష్, బాబా సాహెబ్ గీతేలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను తెలియజేస్తూ, డ్రగ్స్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీలో అధికారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,విద్యార్థిని విద్యార్థులతో మాదక ద్రవ్యాల గురించి చెడు వ్యసనాల గురించి తనకు ఎదురైన చేదు అనుభవాలను పంచుకున్నారు. జిల్లా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ ఏక్కడైతే గంజాయి సరఫరా ఉంటుందో దానిపై ఫోకస్ పెట్టాలని స్కూల్, కాలేజీలలో ఎవరైతే మత్తు పదార్థాలకు అలవాటు పడి బానిసలు అవుతున్నారో అలాంటి వారిని గుర్తించి అధికారులకు తెలియజేయాలన్నారు. జీవితంలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు అలవాటు పడినవారు తప్పకుండా దొరుకుతారని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. మాదకద్రవ్యాల అమ్మకం, రవాణా, వాటి మూలాలు ఎక్కడున్నాయనే వాటి పైన ఉక్కు పాదం మోపుతామన్నారు. మాదకద్రవ్యాలు అనేవి పెద్ద ట్రాప్ అని, వాటికోసం యువత ప్రయత్నించకూడదని అన్నారు. చదువుకునే యువత మత్తుకు బానిస కావద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సదానందం, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లెనినా, డీఎంహెచ్ఓ అప్పయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ప్రార్థన సమయంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు కంది శ్రీనివాస్ రెడ్డి మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే హాని గురించి వివరించారు. సమాజంలో అనేకమంది మత్తు పదార్థాలు వాడి విలువైన తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. పిల్లలెవరూ ఈ మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని, గొప్ప పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆ తర్వాత ఉపాధ్యాయులు వలస పైడి పిల్లలందరిచే ప్రతిజ్ఞ చేయించారు. సమాజంలో మాదకద్రవ్యాల ఉపయోగం వల్ల కలిగే నష్టాల గురించి చైతన్యం తీసుకురావడానికి విద్యార్థులు అందరిచే ర్యాలీ తీయడం జరిగింది. ఈ ర్యాలీలో డాక్టర్ కే వాసుతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు రాణి, మనోహర్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, సమ్మిరెడ్డి, స్వామి, రాజకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు డ్రగ్స్ బారిన పడొద్దు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాదకద్రవ్యాల రహిత జిల్లాగా హనుమకొండ కావాలని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ కోరారు. "అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం" సందర్భంగా బుధవారం నగరంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సరదాగా సిగరెట్ నుంచి ప్రారంభమైన ఈ వ్యసనాలు చివరకు ప్రాణాంతకమైన డ్రగ్స్ తీసుకునేంతవరకు వ్యాపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బంగారు భవిష్యత్తు ఉన్న చదువుకున్న యువత వీటి బారిన పడి వారి జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు ఆయన వాపోయారు. డ్రగ్స్ ముఠాలను అరికట్టటానికి జిల్లా పోలీసు యంత్రాంగం ఎంతో కృషి చేస్తుందని, వారి కృషి ఫలించాలంటే తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పాత్ర ఎంతైనా ఉందన్నారు. పిల్లల ప్రవర్తన ఎప్పటికప్పుడు గమనించి తేడా కనిపిస్తే గమనించి సైకాలజిస్ట్ ద్వారా కౌన్సిలింగ్ ఇప్పిస్తే సత్ఫలితాలు వస్తాయని తెలిపారు. మాదకద్రవ్యాల ముఠాలకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా సత్వర శిక్షలు పడేటట్లు చేస్తే మార్పు వస్తుందని, మాదకద్రవ్యాల వలన జరిగే అనర్థాల గురించి విద్యార్థులలో అవగాహన పెంపొందించడానికి నగరంలోని పలువురు సామాజికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, తమ వంతు బాధ్యత నిర్వహిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

## మత్తు పదార్థాల నియంత్రణ అందరి బాధ్యత




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** అంతర్జాతీయ మాదక ద్రావ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ లో కాళోజి వాకర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి మథర్ థెరిస్సా విగ్రహం వరకు ఈ ర్యాలీ నిర్వహించి అనంతరం జరిగిన సమావేశంలో కాళోజి వాకర్స్ అసోసియేషన్ గౌరవ సలహా దారుడు మైస శ్రీనివాసులు మాట్లాడారు. మాదక ద్రవ్యాల నియంత్రణ అందరి బాధ్యతని, నేడు మాదక ద్రవ్యల వినియోగం పెరిగి యువత నిర్వీర్యం అవుతుందని, యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజానిదేనని, అనేక నేరాలు సంబవించడానికి మత్తు పదార్థాలే కారణమన్నారు. యువ సంపద నిర్వీర్యం అయితే భవిష్యత్ సమాజానికే నష్టమని అన్నారు. పోలీస్, అటవీ, విద్య, వైద్య, అబ్కారీ శాఖలు సంయుక్తంగా విద్యాసంస్థల్లో, గ్రామాల్లో మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా అవెర్నెస్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధ్యులు నామిరెడ్డి వెంకట్ రెడ్డి, కున్సో త్ హట్యా నాయక్, విష్ణు వర్ధన్, నాగేశ్వర్ రావు, రాజన్న, పూజారి వెంకటేశ్వర్లు, పడాల పరమేశ్వర్, దేవుడి మధుసూదన్ రెడ్డి, జగదీష్,రాజు, వెంకటేశ్వర్లు, వేముల రవీందర్, శ్రీహరి, భద్రు, భిక్షం, దేవ్ సింగ్, సాగర్, కొడెం శీను, వెంకట్, విక్రమ్, యాకయ్య, రాధ కృష్ణ, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## మరిపెడలో..



**వరంగల్ వాయిస్, మరిపెడ :** జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల సీతారాంపురం మరిపెడ నందు అంతర్జాతీయ మాదకద్రవ్య నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థిని విద్యార్థులతో ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యానికి వ్యతిరేకంగా, ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సునీల్ మాట్లాడుతూ నేడు ప్రపంచాన్ని పీడిస్తున్న మద్యపానం,ధూమపానం ,డ్రగ్స్, ఇతరత్రా మాదకద్రవ్యాలు వాడుతూ తమ కుటుంబాలను కూల్చుకుంటున్నారన్నారు.. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మత్తు మైకంలో ఏమి చేస్తున్నారో తెలియక సంఘ విద్రోహ శక్తులుగా మారుతున్నారు. కాబట్టి క్రమశిక్షణతో నిబద్ధతతో యువత ,విద్యార్థులు తమ జీవితాలను మార్చుకోవాలని కోరారు. సీహెచ్ ప్రభాకర్ రావు, మంగు, హరి, ఇందిరా, లాల్ చందు, పీఈటీలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు బైక్ ర్యాలీ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రతి గ్రామంలో మాదక ద్రవ్యాలను నిర్మూలిస్తామని తీర్మానం చేసి, ప్రతి ఒక్కరూ మాధకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీని జిల్లా ఎస్పీ జెండా ఊపీ ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగాఎస్పీ మాట్లాడుతూ యువత మత్తులో చిత్తవుతున్నారని, మాధకద్రవ్యాల రవాణా, వినియోగాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మాదకద్రవ్యాలను విక్రయించినా, రవాణా చేసినా, వినియోగించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా అవగాహన పెంపొందించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ ర్యాలీలో అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## యాంటీ డ్రగ్స్ పై అవగాహన




**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో పరకాల సబ్ డివిజన్ పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో జరిగిన యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పరకాల పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పరకాల ఏసీపీ కిషోర్ కుమార్ పాల్గొని మాట్లాడారు. యువకులు, విద్యార్థులు చెడు వ్యసనాలకు గురవద్దన్నారు. యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపరు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజవర్గ పరిధిలోని ఆత్మకూరు, దామెర, పరకాల రూరల్, పట్టణం సీఐ రవిరాజు, ఎస్ఐలు, కాంగ్రెస్ పర్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు కోయడ శ్రీనివాస్, ఉమ్మడి పరకాల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, పట్టణ కాంగ్రెస్ నాయకులు, విద్యావేత్తలు, ప్రముఖులు, యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏవీవీ కళాశాల ఆధ్వర్యంలో..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేడు ప్రపంచ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం పురస్కరించుకొని ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కోడి ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించి హనుమకొండ జిల్లా కలెక్టర్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఏవీవీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రజలను ఆకర్షించే విధంగా ప్లకార్డులను పట్టుకొని ర్యాలీలో హైలెట్ గా నిలిచారు. వీరిని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్, జిల్లా పోలీసు యంత్రాంగం అభినందించారు. అనంతరం కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు మందులకు బానిసవై తమ జీవితాలను మరియు తల్లిదండ్రుల ఆశయాలను నిర్వీర్యం చేయకూడదని, తమ లక్ష్యంపై గురి పెట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తద్వారా అందరూ సంతోషంగా ఉంటారని అన్నారు .ఈ కార్యక్రమంలో సీనియర్ ఎన్ఎస్ఎస్ సీనియర్ వలంటీర్లు ఫయాజ్, రామ్ చరణ్, వివేక్, అరుణ్, కార్తికేయ పాల్గొన్నారు.

# జీవో 46 బాధితులకు అన్యాయం

## బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జీవో 46 బాధితులకు ప్రభుత్వం కావాలని అన్యాయం చేస్తుందని, ప్రభుత్వమే బాధితులతో బంతి ఆటాడుతుందని, అమయాక యువతను మోసం చేస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి మండిపడ్డారు. 20 సార్లకు పైగా కోర్టులో వాదనలు వాయిదా పడటం ప్రభుత్వ పుణ్యమేనని ఎద్దేవా చేశారు. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్లేట్ పిరాయించాడు. ప్రభుత్వం కావాలని కుట్ర చేస్తుంది. అడ్వకేట్ జనరల్ తో అబద్ధాలు ఆడిస్తుంది. ప్రభుత్వం దాటవేత ధోరణిని నమ్ముకుంది. జీవో 46పై తమ వైఖరి చెప్పకపోతే ప్రత్యక్ష ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టడం ఖాయమన్నారు. గత యేడాది కాలంగా తమ హక్కుల కోసం కోట్లాడుతున్న జీవో 46 బాధితులకు సంబధించిన కేసు ఈ రోజు హైకోర్టు లో వాద ప్రతివాదనకు రావడం జరిగింది. కానీ, ప్రభుత్వ తరుపు న్యాయవాది, అడ్వకేట్ జనరల్ కావాలని, కృత్రిమ కారణాలు చెప్పి వాయిదా వేశారు. రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా? ప్రతిపక్ష నాయకుడిగా ఉండి ఉద్దెర మాటలు, హామీలు నోటికి వచ్చిందల్లా చెప్పి, ఈ రోజు అధికారంలోకి రాగానే అన్ని దాటవేసే ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంది ముమ్మాటికీ తప్పని కోర్టు తీర్పు వస్తుంది. కాబట్టి, దాన్ని తాత్కాలికంగా తప్పించుకోవడం కోసమే ప్రభుత్వ యంత్రాంగాన్ని, శక్తి యుక్తులను వాడుకొని వాయిదా వేసేలా చేస్తున్నారు. జీవో 46 పై ప్రభుత్వం వేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వం లోని మంత్రులు ధుద్దిల్ల శ్రీధర బాబు, దామోదర్ రాజనర్సింహ మొన్న మా నిరసనగకు తలొగ్గి తూతూ మంత్రంగా ప్రెస్ మీట్ పెట్టారు. కానీ, ప్రభుత్వం వైపు నుంచి కనీస చలనం లేదు. సీఎం నుంచి ఉలుకు పలుకు లేదని ఎద్దేవా చేశారు. ఈ కమిటీలో మంత్రులు ఇద్దరూ కేవలం వాళ్ల కీలు బొమ్మలే అన్న సంగతి ఒప్పుకోవాలన్నారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కోర్టులో సహజ న్యాయ ప్రక్రియకు అడ్డుపడకుండా జీవో 46 బాధితులకు న్యాయం చేయడానికి కృషి చేయాలన్నారు. జీవో 46 బాధితులకు రక్షణ కవచంగా ఉంటూ, న్యాయం జరిగే వరకూ కోట్లాడుతూనే ఉంటామన్నారు. చట్టసభలు స్పందించకపోతే, కోర్టులో కొట్లాడుతామని, కోర్టులో కూడా సమాధానం దొరకపోతే, ప్రజా కోర్టులో కొట్లాడుతామని తెలిపారు.

# కుక్కల నుంచి అప్రమత్తంగా ఉండాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పలు ప్రాంతాల్లో జరుగుతున్న కుక్కల దాడులను చూసి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, కుక్కల బెడద నివారణకు డివిజన్ నుంచి 12 కుక్కలను మహానగర పాలక సంస్థ సిబ్బంది పట్టుకెళ్లడం జరుగుతుందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. డివిజన్ లోని బీరన్ననగర్, దసరా రోడ్డు, కటికవాడ, ముస్లిం ఏరియా, నానామియా తోటలో కుక్కలు పట్టే సిబ్బంది తిరిగి వెంటాడి కుక్కలను పట్టుకెళ్లారు. డివిజన్ లో కొన్ని ప్రాంతాలలో కుక్కలు గుంపులు గుంపులుగా ఉండటం వలన వీటి ముందట నుంచి బయటకు వెళ్లడానికి సాహసించలేక ప్రజలు ఇంటి ముఖం పట్టేస్తున్నారు. చిన్నపిల్లలను, పెద్దలను కరవడం వల్ల ఆస్పత్రి పాలవుతూ ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. రాత్రి వేళలో కుక్కల అరుపుల వలన ప్రజలందరూ జాగరణ చేయవలసిన పరిస్థితిలు ఏర్పడ్డాయని ఆయన అన్నారు. కుక్కల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిన్నపిల్లలను బయటకు ఒంటరిగా పంపకూడదని ప్రజలను కోరారు. స్థానిక నాయకులు మరుపల్ల గౌతం, మున్సిపల్ సిబ్బంది జ్యోతి ఉన్నారు.

# తెలంగాణకు విద్యాశాఖ మంత్రి కావలెను

## ఎల్తూరి సాయికుమార్ స్వేరో




**వరంగల్ వ్వాయిస్, హనుమకొండ :** తెలంగాణకు విద్యాశాఖ మంత్రి కావలెనని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి 200 రోజులైనా విద్యా శాఖకు మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. అదే విధంగా నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ విద్యాలయ అవసరాలు, ఉపాధ్యాయుల, విద్యార్థుల బాగోగులు పట్టించుకునే నాధుడే లేడన్నారు. విద్యార్థుల సమస్యలు చెప్పుకుందామనుకుంటే విద్యాశాఖను ముఖ్యమంత్రి దగ్గర ఉంచుకొని వారు ఎవ్వరికీ కలిసే టైం ఇవ్వకపోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి అతి తొందరలో విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, శివకుమార్, రమేష్, రజినీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తున్న మోడీ

## న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఎం.శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గత పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేసి ప్రజాస్వామ్య ప్రేమికులుగా ఫోజులు కొడుతున్నదని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎం శ్రీనివాస్ విమర్శించారు. నగరంలోని ఖిలా వరంగల్ పెట్రోల్ పంప్ రోడ్డు ప్రాంతంలోని విద్యానగర్ లో జరిగిన కార్యకర్తల జనరల్ బాడీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ 49 సంవత్సరాల క్రితం నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం తన ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి దేశంలో ఎమర్జెన్సీ పెడితే మోడీ ప్రభుత్వం నేడు హిందుత్వ బ్రాహ్మణీయ ఫాసిజాన్ని అమలు చేస్తూ భారత రాజ్యాంగం స్థానంలో మనువాద రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసేందుకు పూనుకున్నదని ఆయన విమర్శించారు. 18వ విడత పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వం హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి 400 సీట్ల మెజారిటీతో అధికారంలోకి రావడానికి చేసిన ప్రయత్నం దుష్ట ప్రయత్నాన్ని దేశ ప్రజలు తిప్పి కొట్టారని ఆయన అన్నారు. రాజ్యాంగపరంగా ఏర్పాటైన సంస్థలన్నీటిని తమ ప్రభుత్వ జేబు సంస్థలుగా మార్చుకున్నదని, ప్రతిపక్ష పార్టీ నాయకుల మేధావుల ప్రజాస్వామిక వాదులపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టిందని ఆయన మండిపడ్డారు. రాష్ట్రాల హక్కులు కాలరాస్తూ సమాఖ్య వ్యవస్థను రద్దు చేయడానికి చేసిన ఎత్తులు ప్రజలు గమనించారని ఆయన అన్నారు. రాబోవు రోజుల్లో ప్రజల ప్రజాస్వామ్య హక్కులను, జాతుల స్వయం నిర్ణయాధికార హక్కులను కాపాడుకొనుటకు జరిగే పోరాటాలలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు బండి కోటేశ్వరరావు గంగుల దయాకర్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ లు ప్రసంగించారు. ఈ జనరల్ బాడీ మీటింగ్ లో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు జక్కుల తిరుపతి, గట్టి కృష్ణ, పీవైఎల్ జిల్లా నాయకులు గంధ్రతి హరిబాబు, ఇనుముల కృష్ణ, రంజిత్, అక్బర్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

# కలకోటి మహేందర్‌ను ఏజీపీగా నియమించండి

**సహకరించాలని**

**పెరుమాండ్ల రామకృష్ణకు వినతి**

**డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రముఖ న్యాయవాది కలకోటి మహేందర్ ను హనుమకొండ జిల్లా కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా నియమించడానికి సహకరించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల రామకృష్ణకు వినతి పత్రం సమర్పించారు. గత రెండు దశాబ్దాలుగా కలకోటి మహేందర్ న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ పేదలు,దళితులు, బలహీన వర్గాలు, మహిళలు, మైనారిటీలకు ఉచితంగా న్యాయ సలహాలు, సహాయాన్ని అందిస్తూ సత్వర న్యాయం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. అసైన్డ్ భూమి సమితిని ఏర్పాటు చేసి అసైన్డ్ భూములకు శాశ్వత హక్కులు కల్పించాలని పోరాడారని మాదాసి సురేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ కలకోటి మహేందర్ కు ఏజీపీగా అవకాశం కల్పించడానికి పూర్తిగా సహరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేరెళ్ల బస్వారెడ్డి, ధార పవన్ కళ్యాణ్, ధార ప్రమీల, జన్ను పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వైద్య విద్య ప్రవేశ పరీక్షల్లో (నీట్) జరిగిన అక్రమాలపై ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పటివరకు నోరు మెదపకపోవడాన్ని నిరసిస్తూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో హనుమకొండ అంబేద్కర్ సర్కిల్ దగ్గర ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు కేంద్రంగా నీట్ పరీక్షల ప్రశ్నాపత్రం లీకేజీ జరిగిందని, ఒక్కొక్క విద్యార్థి దగ్గర నుంచి 30 నుంచి 50 లక్షల రూపాయలు వసూలు చేశారని, విచారణలో తేలిన నేటి పరీక్షల్లో అక్రమాలు జరిగాయని చెప్తున్నప్పటికీ, దేశ ప్రధాని ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. దేశంలో 24 లక్షల మంది విద్యార్థులు భవితవ్యంతో బీజేపీ నాయకులు ఆటలాడుకుంటున్నారని అన్నారు. ఎన్ టీఏ నిర్వహణలో అనేక లోపాలు వెలుగులోకి వచ్చినా నామ మాత్రమే చర్యలు తీసుకొని వదిలి వేశారని, ఎన్ టీఏను రద్దు చేయాలని, నీట్ ప్రవేశ పరీక్ష రద్దుచేసి, గతంలో మాదిరిగా రాష్ట్రాల్లో వారిని పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మంద మంద సుచందర్, జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, డీవైఎఫ్ఐ నాయకులు పల్లపు సురేష్, రమణారెడ్డి, సంతోష్, ఏం.రమేష్, కృష్ణవంశీ, ఏం.సంతోష్, కె.ప్రవీణ్ పాల్గొన్నారు.

# 16వ సారి రక్తదానం చేసిన మునిగాల రాంప్రసాద్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రంగంపేటకు చెందిన క్రీ.శే మునిగాల యేషెందెర్-మునిగాల లక్ష్మి దంపతుల కుమారుడు యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ కీలక సభ్యుడు, వరంగల్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ బాయ్స్ కళాశాలలో ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న"మునిగాల రాంప్రసాద్" తాను ఎంతగానో అభిమానించే "ఆరేపల్లి భిక్షపతి పుట్టినరోజు " సందర్భంగా వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ లో 16వ సారి రక్తదానం చేయడం జరిగింది. తాను రక్తదానం చేయడంతో పాటు ఎంతో మందిచే రక్తదానం చేయించడంతో పాటు అనేక అనాథ , వృద్ధాశ్రమంలో నిరుపేద పిల్లల చదువు కోసం తనతో పాటు దాతల సహకారంతో అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనేక సామాజిక సేవా కార్యక్రమలు నిర్వహించిన మునిగాల రాంప్రసాద్ ను యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్ కుమార్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, కోలా రాజేష్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, అలువాల పృథ్వీ, ఉప్పరపల్లి రాజ్ కుమార్, పాలకుర్తి విష్ణు, ఎస్ కే ముస్తఫా, పులి కిరణ్ కుమార్ లు అభినందించారు.

వరంగల్ వాయిస్ Evening Daily
బుధవారం 26, జూన్ 2024
www.warangalvoice.net

# వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకుందాం

## ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మూడవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి ఉవ్విళ్లూరుతున్నదని, దేశ భవిష్యత్తు కోసం, రైతుకూలీల భద్రత కోసం కార్పొరేట్ శక్తుల బారి నుంచి వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి అన్నారు. బుధవరం ఏఐకేఎంఎస్ మహబూబాబాద్ జిల్లా జనరల్ కౌన్సిల్ ను అమరుడు దేశెట్టి రామచంద్రయ్య హాల్ (ముదిరాజ్ సంఘ భవనం)లో మామిడాల భిక్షపతి ప్రారంభించారు. ఆయన తన ప్రారంభోపన్యాసంలో" నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఈ దేశ రైతాంగం ఢిల్లీ సరిహద్దులను దిగ్బంధనం చేసి వీరోచిత పోరాటం నిర్వహించి వాటిని వెనక్కుకొట్టారని అన్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై బహుళజాతి సంస్థలు గుత్తాధిపత్యం సాధించాయన్నారు. మార్కెట్ ను సైతం వీరే శాసిస్తున్నారని తెలిపారు. నకిలీ విత్తనాలు, కల్తీ పురుగు మందుల వలన భూమి సారం కోల్పోవటం, పైర్లకు రకరకాల కొత్త వైరస్ లు సోకి రైతులు దారుణంగా నష్టపోతున్నారని అన్నారు. పాలకుల రైతు వ్యతిరేక విధానాల ఫలితంగా అంపశయ్య పైకి చేరిన వ్యవసాయ రంగాన్ని మొత్తంగా బహుళజాతి సంస్థలకు అప్పచెప్పటానికి మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆయన మండిపడ్డారు. పాలకులు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలైన రుణమాఫీ, పంటల బోనస్, పంటల బీమా పథకాలను వెంటనే అమలు చేయాలని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందించాలని, పంట పెట్టుబడి కోసం బ్యాంకు రుణాలను ఇప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు తాజ్ పాషా, బట్టు నాగేశ్వరరావు, గజ్జి లింగన్నలు జనరల్ కౌన్సిల్ కు అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా ఈజనరల్ కౌన్సిల్ లో ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు మోకాళ్ల మురళీకృష్ణ, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఊకె పద్మ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు బూర్క వెంకటయ్య, జిల్లా నాయకులు గుజ్జు దేవేందర్, యాదగిరి యుగేందర్, బానోత్ నర్సింహా ప్రసంగించారు. జనరల్ కౌన్సిల్ ప్రారంభానికి ముందుగా ఏఐకేఎంఎస్ జెండాను సంఘం సీనియర్ నాయకులు కల్లా వెంకటరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల అమరులైన సంఘం నాయకులు దేశెట్టి రామచంద్రయ్య, సందు వెంకన్న, కసనబోయిన ఐలయ్య తదితరులకు నివాళులర్పించి సంతాపం తెలియ జేశారు. కౌన్సిల్ అనంతరం రైతు రుణమాఫీ తక్షణం అమలుచేసి కొత్త పంట రుణాలను బ్యాంకుల ద్వారా యిప్పించాలని కోరుతూ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కొట్టం అంజయ్య, అడ్డూరి వెంకన్న, కొటెం అచ్చన్న, కోడి నర్సయ్య, యడ్ల మల్లయ్య, ముండ్ల రంగారావు, పూనెం లింగన్నలతో పాటు ఐఎఫ్ టీయూ జిల్లా కార్యదర్శి శివారపు శ్రీధర్, జిల్లా సహాయ కార్యదర్శి మాధంశెట్టి నాగేశ్వరరావు, పీడీఎస్ యూ రాష్ట్ర నాయకులు ఇడంపాక శ్రీశైలం, నేతకాని రాకేష్, బోనగిరి మధు, మాదారపు నాగరాజు, అరుణోదయ జిల్లా కార్యదర్శి చారి హరీష్, పీవైఎల్ జిల్లా కార్యదర్శి బట్టు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో స్కూళ్లు బంద్



**వరంగల్ వాయిస్, కాటారం :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఏబీవీపీ భూపాలపల్లి నగర కార్యదర్శి రాజబాబు ఆధ్వర్యంలో కాటారం మండలంలోని పలు ప్రభుత్వ ప్రైవేటు విద్యారంగ సంస్థలను స్వచ్ఛందంగా బంద్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్న తోటి కార్యకర్తలు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల విద్యారంగం పట్ల మొండి వైఖరి చూపిస్తుందని, వెంటనే పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, ఎంఈఓ, డీఈవో పోస్టులను భర్తీ చేయాలని, సరైన సమయంలో పాఠ్యపుస్తకాలు ఏకరూప దుస్తులను అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మహాదేవపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో నగర కార్యదర్శి పేట సాయి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల విద్యారంగం పట్ల మొండి వైఖరిని చూపిస్తుందని, ప్రైవేటు పాఠశాలలో అక్రమంగా ఫీజులు దోపిడీ చేస్తూ విద్యార్థులను వేధిస్తున్నారని, ప్రైవేటు పాఠశాలలో అక్రమంగా పుస్తకాలు యూనిఫామ్ అమ్మడం ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంజయ్, మింటు ,సాయి, ఆకాష్, రవితేజ, పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



**వరంగల్ వాయిస్, నడి కూడ :** మండలం ప్రాథమిక పాఠశాల నార్లాపూర్ లో ఆ గ్రామానికి చెందిన కొమురవెల్లి ముక్తేశ్వర్ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలను,యు కంపాక్స్ బాక్సులను పంపిణీ చేయడం జరిగింది. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పలీత శ్రీహరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు మచ్చ రవీందర్, సాంబయ్య, ముక్తేశ్వర్ కుటుంబ సభ్యులు సదానందం, ప్రకాశం సదానందం, వీరయ్య, శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ఘన సన్మానం

**వరంగల్ వాయిస్, కేయూ :** నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఘనవిజయం సాధించి మొట్ట మొదటిసారిగా కాకతీయ యూనివర్సిటీకి విచ్చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేధావుల ఫోరం మెంబర్ జి.వీరన్న నాయక్ ఆధ్వర్యంలో కేయూ లైబ్రరీ వద్ద విజయోత్సవ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్సీగా ఘనవిజయం సాధించిన తీన్మార్ మల్లన్నను భారీ గజమాలతో తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి నరేష్ ఘనంగా సన్మానించారు. తదనంతరం నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఈ విజయం పట్టభద్రుల విజయమని, తన విజయంలో





కాకతీయ యూనివర్సిటీ కీలకపాత్ర పోషించిందని అన్నారు, కేయూ టీచింగ్, నాన్ టీచింగ్ ఖాళీల భర్తీ విషయమై సీఎం దృష్టికి తీసుకెళ్లి నోటిఫికేషన్ విడుదల చేసే దిశగా కృషి చేస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. కేయూ సమస్యలపై విద్యార్థుల బృందాన్ని సీఎం రేవంత్ రెడ్డి దగ్గరికి తీసుకెళ్తానని అన్నారు. టీపీసీసీ ఆర్గనైజేషన్ సెక్రటరీ డాక్టర్ గజ్జల మల్లేష్, కేజేసీ నాయకులు డాక్టర్ మంద వీరస్వామి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల కార్తీక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ తీగల ప్రేమ్ కుమార్, బండి శ్రీను, సురాసి కృష్ణ, మహమ్మద్ మహబూబ్ పాషా, అభిరామ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరెగంటి నాగరాజ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బీమా వినయ్ కుమార్, కేయూ విద్యార్థి నాయకులు బొట్ల మనోహర్, అజ్మీరా సునీల్ నాయక్, వంగాల వర్షిత్ సాకేత్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రైల్వే స్టేషన్ లో అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.40 కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణపు పనులను దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజినల్ జనరల్ మేనేజర్ బర్తేశ్ కుమార్ జైన్ పరిశీలించారు. విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక రైలులో మహబూబాబాద్ స్టేషన్ కు చేరుకున్నారు. స్టేషన్ లో తిరుగుతూ బుకింగ్ కార్యాలయం ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, స్టేషన్ మాస్టర్ కార్యాలయం, మరుగు దొడ్లు, వెయిటింగ్ హాల్లు, తదితర కార్యాలయాల నిర్మాణపు పనులను పరిశీలించి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. 12 మీటర్ల వంతెన, ఏసీ, వీఐపీ, జనరల్ వెయిటింగ్ హాల్లు ఆధునిక హంగులతో పార్కింగ్, లిఫ్టులు, ఎస్కలేటర్లు తదితర అధునాతమైన వసతులు ఏర్పాటు చేయనున్నారు. సిబ్బంది పనితీరుపై డీఆర్ఎం పలువురిని అడిగి తెలుసుకున్నారు. పనుల పరిశీలించిన బృందంలో ఏడీఆర్ఎంలు సుబ్రమణ్యం, గోపాల్ నాయక్, అన్ని శాఖల రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మానేరు బ్రిడ్జి



**వరంగల్ వాయిస్ , మల్హర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, పెద్దపల్లి జిల్లాలను కలుపుతూ మండల పరిధిలోని పీవీ నగర్ సమీపంలో మానేరు నదిపై నిర్మించిన వంతెన పై భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా తయారైంది. వంతెనపై పలు చోట్ల ఇనుప చువ్వలు పైకి తేలడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన పై ఏర్పడిన భారీ గుంతలలో పడి వాహనాలు సైతం పాడవుతున్నాయి. రెండు జిల్లాల ను అనుసంధానం చేసే వంతెన పై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు నడుస్తాయి, కాబట్టి, వాహనదారుల ఇబ్బందుల దృష్ట్యా వెంటనే అధికారులు స్పందించి వంతెన పై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేసి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

## మహిళలపై పెరుగుతున్న దాడులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాష్ట్రంలో మహిళలపై రోజురోజుకు దాడులు, దౌర్జన్యాలు, హత్యలు పెరుగుతున్నాయని ప్రగతిశీల మహిళా సంఘం పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.కవిత, జిల్లా నాయకురాలు ఎండీ కవిత అన్నారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ప్రగతిశీల మహిళా సంఘం ఆవేదన వ్యక్తం చేశారు. గార్ల మండలం ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ)మహాసభ అమరులు కామ్రేడ్ గుగులోతు హం కినగర్ గోపాలపురం గ్రామంలో జరిగింది. అనంతరం వారు ప్రసంగిస్తూ ముఖ్యంగా పసిపాపలపైన ఆదివాసీ, దళిత, బలహీన వర్గాల మహిళలపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వలన తిరిగి పునరావృతమవుతున్నాయని వారన్నారు. మహిళలపై వివక్షత దాడులకు, దౌర్జన్యాలకు, హత్యలకు వ్యతిరేకంగా స్త్రీ, పురుష సమానత్వంకై మహిళలందరూ ఐక్యంగా పోరాడవలసిన అవసరం ఆసన్నమైందని వారు పిలుపునిచ్చారు. అనంతరం మహాసభ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా నన్నేబోయిన సరస్వతి, ప్రధాన కార్యదర్శిగా గోల్ల సుజాత, సభ్యులుగా గూగులోతు విజయ, అనసూర్య తేజ, అంకి, పాక పద్మ, నెత్తికొప్పుల చిన్న, నాగమణి, ఎస్ కే బిజాంబి, జాటోతు మంగమ్మ, ఇస్లావత్ రజిత, గుగులోతు వినోద, 11మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికైంది.

# అవినీతి సబ్జెక్టుగా భారతీయుడు-2

## మూడో పార్ట్ కూడా ఉంటుందన్న శంకర్

కమల్ హాసన్ హీరోగా దర్శకుడు శంకర్ రూపొందించిన చిత్రం 'భారతీయుడు'. 1996లో వచ్చిన ఈ చిత్రానికి సీక్వెల్‌గా తాజాగా 'భారతీయుడు 2' ను తెరకెక్కించారు. జులై 12న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో మీడియాతో మాట్లాడుతూ.. నేను గతంలో నటించిన కొన్ని చిత్రాల్లోని పాత్రలతో పోలిక ఉండడంతో 'భారతీయుడు'లో భాగం కావాలని అనుకోలేదు. అందుకే శంకర్ తనంతట తానుగా నన్ను తప్పించాలని కావాలనే నా రెమ్యునరేషన్ పెంచాను. కానీ, నిర్మాతలు నా డిమాండ్లు అంగీకరించడంతో ఆ చిత్రంలో నటించాను. శంకర్‌కు తన కథపై నమ్మకం ఎక్కువ. నాతోనే తీయాలని పట్టుబట్టి 'భారతీయుడు' తీశాడు. అతని పట్టుదల చూసి నేను ఆశ్చర్యపోయాను' అని చెప్పారు. తనను ఎన్నో ఏళ్లుగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. భారతీయుడు కథను మూడు పార్ట్‌లుగా ఎందుకు తీయాల్సివచ్చిందో శంకర్ వివరించారు. 'భారతీయుడు' మొదటి భాగం ఒక స్టేట్‌లో జరిగే కథ. ఇప్పుడు 'భారతీయుడు 2' దేశంలోని అన్ని రాష్ట్రాలకు సంబంధించిన కథ. సినిమా ప్రారంభించినప్పుడు ఒక్క పార్ట్‌లోనే మొత్తం చూపించాలని భావించాం. కానీ, చిత్రీకరణ మొదలుపెట్టాక అన్ని సన్నివేశాలు అద్భుతంగా వచ్చాయి. ఒక్క పార్ట్‌లోనే దీన్ని చూపించాలంటే కొన్ని సన్నివేశాలు కట్ చేయాలి. లేదంటే నిడివి తగ్గించాలి. అలా చేస్తే వాటిలో ఉన్న పవర్ పోతుంది. అన్ని సీన్స్ బాగా వచ్చాయి. ఎక్కడా బోర్ కొట్టడం లేదనిపించింది. అందుకే దీన్ని మరో పార్ట్ (భారతీయుడు 3) చేయాలని నిర్ణయించుకున్నాం' అని తెలిపారు.



# రేపే కల్కి 2898 ఏడి విడుదల

## గతంలో ఏ సినిమాకు రానంత క్యూరియాసిటీ






ప్రభాస్, దర్శకుడు నాగ్ అశ్విన్ కాంబినేషన్ లో వస్తున్న 'కల్కి 2898 ఏడి' నేటి ఉదయం విడుదల కాబోతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోసినిమా ప్రియులు అందరూ ఈ సినిమా కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా విడుదలకు ముందే అనేక సంచలనాలు నమోదు చేస్తోంది. బాహుబలి, ఆర్ఆర్ఆర్ లను మించి ఈ మూవీకి పబ్లిసిటీ వచ్చింది. ఈ సినిమాలో ప్రభాస్ తో పాటు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకోన్, దిశా పటాని లాంటి దిగ్గజ నటీనటులు వున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రచార చిత్రాలు ఆసక్తికరంగా ఉండటమే కాకుండా, సినిమాపై మరింత ఉత్కంఠని పెంచింది. ఈ చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ సినిమా పురాణాల ఆధారంగా కల్పిత కథని తీశానని చెప్పారు. శ్రీకృష్ణ భగవానుని నిర్యాణంతో ద్వాపరయుగం తరువాత కలియుగం ప్రారంభం అవుతుంది. అమితాబ్ బచ్చన్ అశ్వద్ధామ పాత్రలో కనపడనున్నారు. ఇప్పటికే చాలామంది అశ్వద్ధామ గురించి తెలుసుకోవడానికి అంతర్జాలంలో వెతుకుతున్నారు. అడిగి తెలుసుకుంటున్నారు. కమల్ హాసన్ కలి పాత్రలో కనపడనున్నారని అంటున్నారు. ఇప్పుడు నడుస్తున్నది కలియుగం! కలి ప్రభావం గురించి భాగవతంలో వ్యాస మహర్షి చెపుతారు. పోతన గారు ఆ భాగవతాన్ని తెలుగులోకి అనువదించారు. కలి అంటే ఎవరు, అతని ప్రభావం ఎలా ఉంటుంది అనే ప్రశ్నలు ఇప్పుడున్న యువకులు తమ సందేహాల్ని అడిగి తెలుసుకుంటున్నారు. అశ్వద్ధామ పాత్ర వేసిన అమితాబ్ బచ్చన్ ఎందుకు ఒంటికి గుడ్డలు చుట్టుకొని కనపడ్డారు, మామూలుగా అశ్వద్ధామకి శ్రీకృష్ణుడు ఎందుకు శాపం ఇచ్చారు, ఇవన్నీ సందేహాలు అడుగుతున్నారు. మరి నాగ్ అశ్విన్ అశ్వద్ధామతో మొదలుపెట్టి కలియుగ అంతం ఎలా అవబోతోంది అని కూడా చూపిస్తారా, లేక ద్వాపరయుగం చివర్లో ఏమి జరిగింది, కలియుగం ఎలా మొదలైంది, ఎలా వుండబోతోంది, చివర్లో ఏమవుతుంది ఈ విషయాలను చూపిస్తారా, కథ ఎలా వుండబోతోంది అనే విషయాలు ఆసక్తికరంగా ఉంటాయి అని అంటున్నారు. ప్రచార చిత్రాలు చూస్తే అందులో అమితాబ్ బచ్చన్ ఒక ప్రధాన పాత్రలో కనపడితే, ఇంకో ప్రధాన పాత్ర భైరవ పాత్ర అయిన ప్రభాస్. భైరవ అంటే ఈశ్వరుడు అని కూడా ఒక అర్థం వస్తుంది. అయితే ఇక్కడ ఇంకో ఆసక్తికర అంశం ఏంటంటే, నేపాల్ దేశంలో పాండవులలో అతి బలసంపన్నుడు అయిన భీముడిని దేవుడుగా కొలుస్తారు. అక్కడ భీమునికి అనేక దేవాలయాలు వున్నాయి. అక్కడ భీముడిని భైరవుడు అని కూడా పిలుస్తారు. మరి నాగ్ అశ్విన్ తీసుకున్న భైరవ పాత్ర నేపాల్ లో పూజించే భీముడి కి స్ఫూర్తిగా ఏమైనా తీసుకున్నారా. ఇవన్నీ సినిమా చూస్తే కానీ తెలియదు.

కలియుగంలో కలి ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. కలి ఎలా ఉంటాడు అనే విషయంలో అతని వర్ణన కూడా చాలా ఏహ్యంగా ఉంటుంది. పురాణాల్లోనూ కలియుగంలో ప్రజలు ఎలా ఉండబోతున్నారు, ఎటువంటి పరిస్థితులు ఎదురవుతాయి అనే విషయాల గురించి వ్యాస మహర్షి చెప్పారు. కలియుగం అంతం అవుతున్న కొద్దీ, సమాజంలో అధర్మం పూర్తిగా నశిస్తుంది, మానవుని ఆయుః ప్రమాణాలు పూర్తిగా తగ్గిపోతాయి, దోపిడీలు, దొంగతనాలు, బలవంతుడిదే రాజ్యం అనే విధంగా ఉంటుంది అని చెప్పారు. తండ్రి, కుమారుడు ఇద్దరూ ఒకే అమ్మాయిని వివాహం చేసుకునే స్థితికి వస్తుంది, అంటే అధర్మం అంతగా ప్రబలుతుంది అని చెప్పారు వ్యాస మహర్షి. ధర్మం అనేది పూర్తిగా నశించిపోయిన శంభాలా అనే గ్రామంలో రోజు విష్ణుయశుడు, సుమతి అనే దంపతులకు కల్కి అవతారంగా భగవానుడు జన్మిస్తానని చెబుతారు. ఇప్పుడు 'కల్కి 2898 ఏడి' అని పేరు పెట్టిన దర్శకుడు నాగ్ అశ్విన్ ప్రభాస్ ని ఏవిధంగా చూపించబోతున్నారు అనేది ఆసక్తికరం. కాశీకి పురాణాల్లో ఎంతో ప్రత్యేకత వుంది. ఈ నగరం గురించి చాలా గొప్పగా చెపుతారు. యుగాంతం అయిపోయి ప్రళయం వచ్చినప్పుడు, ప్రపంచం అంతా నీటితో మునిగిపోయి, చిమ్మ చీకటితో నిండి ఉంటే, ఒక్క కాశీ నగరం మాత్రం చెక్కు చెదరకుండా ఉంటుంది అని పురాణాల్లో చెపుతారు. ఈశ్వరుడు కాశీ నగరంలో తపస్సు చేసాడని అతను సృష్టించిన నగరమే ఇది, అందుకని ఎంత ప్రళయం వచ్చినా ఈ కాశీ నగరం మాత్రం చెక్కు చెదరకుండా ఉంటుందని అంటారు. 'కాశ్యాన్తు మరణాన్ ముక్తి: అంటే కాశీలో మరణిస్తే ముక్తి లభిస్తుంది అని విశ్వాసం. అటువంటి కాశీ నగరాన్ని ఒక ప్రధాన పాత్ర చేశారు దర్శకుడు నాగ్ అశ్విన్. ఇలా పురాణాల ప్రాతిపదికగా ఒక కల్పిత కథతో ప్రేక్షకుల ముందుకు 'కల్కి 2898ఏడి' అనే సినిమా వస్తోంది. ఇందులో నాగ్ అశ్విన్ తన కల్పిత పాత్రలతో ఎటువంటి కథని ప్రేక్షకులకి అందించబోతున్నారు అనే విషయం నేటి ఉదయం తెలుస్తుంది.

### కల్కి ప్రీ బుకింగ్స్‌లో రికార్డు

**సలార్‌ను మించి కలెక్షన్లు**

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి' విడుదలకు ముందే రికార్డులు సృష్టిస్తోంది. ప్రీ సేల్ బుకింగ్స్‌లో ఇప్పటికే కొన్ని బ్లాక్ బస్టర్ చిత్రాల రికార్డులను బ్రేక్ చేయగా.. ఇప్పుడు 'సలార్' రికార్డును కూడా అధిగమించింది. ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ కల్కి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఓవర్సీస్‌లో మాత్రం ఒకరోజు ముందుగానే విడుదల కానుంది. తాజాగా ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ప్రీ సేల్స్ ఓపెన్ చేయగా అవి ప్రభాస్ గత చిత్రం రికార్డును బ్రేక్ చేశాయి. 'సలార్' ప్రీ సేల్ బుకింగ్స్‌ను 'కల్కి' రిలీజ్‌కు ఒక్కరోజు ముందుగానే క్రాస్ చేసింది. ఈ చిత్రం ప్రీ సేల్స్ ప్రారంభించిన గంటల్లోనే 'ఆర్ఆర్ఆర్' రికార్డులను బ్రేక్ చేసింది. ఇక ఇప్పటి వరకు కేవలం నార్త్ అమెరికాలోనే 1,25,000 టికెట్స్ అమ్ముడైనట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. మరోవైపు 'కల్కి' ఓపెనింగ్ కలెక్షన్లు రూ.200 కోట్లు ఖాయమంటూ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ప్రభాస్ గతంలో నటించిన 'బాహుబలి-2', 'సలార్', 'ఆదిపురుష్', 'సాహో' చిత్రాలు మొదటిరోజు రూ.100కోట్లు సాధించిన సంగతి తెలిసిందే. వీటికంటే 'కల్కి'కి ఎక్కువ కలెక్షన్లు వచ్చే అవకాశమున్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నారు. ప్రభాస్ సరసన దీపికా పదుకొణె నటించిన ఈ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్‌లో అగ్ర నటీనటులు అమితాబ్ బచ్చన్, దీపిక పదుకొణె, కమల్‌హాసన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తాజాగా వీరంతా నాగ్ అశ్విన్‌పై, 'కల్కి' కథపై ప్రశంసలు కురిపించారు.





# అందుకోసమే .. 16 కిలోల బరువు పెరిగా

ఇటీవల విడుదలైన 'అమర్ సింగ్ చంకీల'తో విజయాన్ని అందుకున్నారు బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా. ఈ సినిమా కోసం ఆమె 16 కిలోల బరువు పెరిగారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో దీని గురించి ప్రస్తావిస్తూ.. ఎంతమంది హీరోయిన్లు ఇలా బరువు పెరగడానికి సిద్ధంగా ఉన్నారని ప్రశ్నించారు. 'కెరీర్ ప్రారంభంలో సరైన కథలను ఎంపిక చేసుకోలేకపోయాను. ప్రేక్షకులు నా నుంచి మంచి పాత్రలను కోరుకుంటున్నారని అర్థమైంది. దానికోసం హోం వర్క్ చేయాలని నిర్ణయించుకున్నా. సవాళ్లతో కూడిన కథలను ఎంచుకోవడం ప్రారంభించాను. అలాంటివి చేస్తేనే ఎక్కువ గుర్తింపు వస్తుంది. 'అమర్ సింగ్ చంకీల' కోసం నేను 16 కిలోల బరువు పెరిగాను. ఎంతమంది ఇలా బరువు పెరగడానికి సిద్ధంగా ఉన్నారు?. ఈరోజుల్లో ఇలాంటి సాహసం తక్కువమంది హీరోయిన్లు చేస్తారు. ఇండస్ట్రీ మొత్తంలో ఒకరో, ఇద్దరో దీనికి అంగీకరిస్తారు. అంకితభావం, నిబద్ధత కలిగిన హీరోయిన్లు మాత్రమే ఇలా చేయగలరు. ఈ చిత్రం నాకు అసాధారణ ప్రయాణం. లైవ్‌లో ఎలా పాడాలో రెండేళ్లు శిక్షణ తీసుకున్నా. రిస్క్ తీసుకున్నాను కాబట్టే చిత్రం విజయం సాధించింది. కష్టానికి తగిన ప్రతిఫలం ఎప్పుడూ ఉంటుంది' అని చెప్పారు. ప్రియాంక చోప్రా బంధువుగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు నటి పరిణీతి చోప్రా. 2011లో విడుదలైన 'లేడీస్ వర్సెస్ రికీ బహ్ల్'లో కీలక పాత్ర పోషించారు. 'కిల్ దిల్', 'డిష్యూం', 'గోల్‌మాల్ అగైన్', 'కేసరి', 'సైనా' వంటి చిత్రాల్లో ఆమె కథానాయికగా ప్రేక్షకులను అలరించారు. ఇటీవల 'అమర్ సింగ్ చంకీల'తో హిట్‌ను సొంతం చేసుకున్నారు.



# ముగిసిన ప్రెస్ క్లబ్ క్రీడోత్సవాలు

## ఉత్కంఠభరితంగా క్రికెట్ ఫైనల్ మ్యాచ్
## విజేతగా నిలిచిన కెమెరామెన్స్ -XI జట్టు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్-మీట్ 2024 లో భాగంగా బుధవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరిగిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్ లో కెమెరామెన్స్-XI వర్సెస్ యంగ్ ఎలక్ట్రానిక్ మీడియా జట్ల మధ్య జరిగిన మ్యాచ్లో కెమెరా మెన్స్ -XI జట్టు విజయం సాధించింది. ఉత్కంఠ భరితంగా సాగిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్ లో కెమెరామెన్స్-XI జట్టు 9 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 121 పరుగులో విజయకేతం ఎగురవేశారు. మొదట గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్ క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న యంగ్ ఎలక్ట్రానిక్ మీడియా జట్టు, 15 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 117 పరుగులు చేసింది. ఓపెనర్ గా బరిలోకి దిగిన తిరుపతి 38 బాల్స్ లో 56 పరుగులు సాధించి నాటౌట్ గా నిలిచారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కెమెరామెన్స్-XI జట్టు 9 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసి విజయం సాధించారు. 17 బాల్స్ ఎదుర్కొని 39 రన్స్ చేసి 1 వికెట్ తీసిన మున్నా కెమెరామెన్స్ -XI జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గోకారపు శ్యాం, బొడిగె శ్రీను, జాయింట్ సెక్రెటరీలు వలిశెట్టి సుధాకర్, పొడిచెట్టి విష్ణువర్ధన్, ఈసీ మెంబర్లు భరత్, దిలీప్, శ్రీకాంత్, నయీంపాషా, జర్నలిస్టు నేతలు గడ్డం రాజిరెడ్డి, బీఆర్ లెనిన్, కక్కెర్ల అనిల్ కుమార్, గడ్డం కేశవమూర్తి, మస్కపురి సుధాకర్, సాక్షి ఎడిషన్ ఇంచార్జి లింగయ్య, పెద్దీష్, అరుణ్, వెంకటరత్నం, కృష్ణమోహన్, ప్రశాంత్, రాజ్ కుమార్, వేణు గౌడ్, పోగాకుల అశోక్, సంజీవ్, పబ్బు సతీష్, వెంకట్, రజనీ తో పాటు స్టాఫ్ రిపోర్టర్లు, బ్యూరోలు, జర్నలిస్టులు, కెమెరామెన్లు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయం, ధర్మారంలో “ఏక్ పేడ్ మా కే నామ్” , డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి జూన్ 23 నుంచి జయంతి జూలై 6 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా ప్రధాన మంత్రి మోదీ పిలుపు మేరకు బుధవారం వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం మొక్కలను నాటడం ద్వారా చెట్లు భూమిని పచ్చగా మారుస్తున్నాయని, మొక్కలు నాటడం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, నేడు నాటిన చెట్టు ఎంతోమంది భవిష్యత్ తరాలకు ఆక్సిజన్ అందజేస్తుందని వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. పెరుగుతున్న కాలుష్యంతో, ఓజోన్ పొర దెబ్బతింటుందని, ఫలితంగా, భవిష్యత్తులో, సౌర కిరణాలు నేరుగా భూమిపై ప్రభావం చూపుతాయన్నారు. దీని కారణంగా భూమి మానవ జీవితానికి సురక్షితంగా ఉండదని ఆయన అన్నారు. ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే వీలైనన్ని ఎక్కువ చెట్లను నాటడం, కార్బన్ డై ఆక్సైడ్ విడుదలను తగ్గించడం ఒక్కటే మార్గమన్నారు. చెట్లను నాటేటప్పుడు రెండు అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ తెలిపారు. మొదటిది, నాటిన చెట్లు సుదీర్ఘ జీవితకాలం కలిగి ఉండాలి, అవి పీపాల్, మర్రి, వేప, జామున్, ఇతర గరిష్ట ఆక్సిజన్‌ను అందించగలగాలి. ఈ చెట్లు 60-100 శాతం వరకు ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయని, ఏళ్ల తరబడి భూమి పరిరక్షణకు దోహదం చేస్తాయని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి బూత్ లలో మొక్కలను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, కార్యాలయ కార్యదర్శి కంది క్రాంతి కుమార్, డివిజన్ అధ్యక్షులు గోదాసీ అశ్విన్ కుమార్, అరె కుమార్, జెట్లింగ్ శివప్రసాద్, శ్రీనివాస్, ల్యాద రాజేష్, వెంకటేష పాల్గొన్నారు.

# సీపీఐ వినూత్న నిరసన

## నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలి

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పెరిగిన నిత్యావసర ధరలను నియంత్రించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. బుధవారం హనుమకొండ అంబేద్కర్ సెంటర్ లో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో వినూత్న నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ గత నెల రోజులుగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటినా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగి సామాన్యులకు మోయలేని భారంగా మారిందని అన్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు కూడా ఆకాశాన్నంటాయని, టమాట, పచ్చి మిర్చి కిలో రూ. 100కు చేరుకున్నాయని అన్నారు. ఉల్లిగడ్డ కిలో రూ.50కి చేరుకుందని, గడిచిన నెల రోజులలోనే ధరలు అమాంతం పెరిగినా పాలకులు చోద్యం చూస్తున్నారని అన్నారు. బ్లాక్ మార్కెట్ దారులు, దళారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలు పెరిగేందుకు కారణమవుతున్నా వారిపై చర్యలు చేపట్టడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు కఠిన చట్టాలను రూపొందించి బ్లాక్ మార్కెట్ దారులను,దళారులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు కొట్టెపాక రవి, రాసమల్ల దీనా, కామెర వెంకటరమణ, కండె నర్సయ్య, పూర్ణ చందర్ పాల్గొన్నారు.

# మహిళకు స్క్రబ్ టైఫస్, మల్టీ ఆర్గాన్ ఫెల్యూర్

## యశోద హాస్పిటల్స్‌లో చికిత్స విజయవంతం

## డాక్టర్ మాటూరి నాగార్జున




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణాలోని వరంగల్ జిల్లాకు చెందిన 38 ఏళ్ల దుండి శైలజా అనే మహిళ మల్టీ-ఆర్గాన్ డిస్ఫంక్షన్ సిండ్రోమ్ (ఎంఓడీఎస్ )తో బాధపడుతున్న సందర్భంగా హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్ లో విజయవంతంగా ఆమెకు చికిత్స అందించడం జరిగిందని డాక్టర్ మాటూరి నాగార్జున తెలిపారు. బుధవారం హనుమకొండ నక్కల గుట్ట యశోద హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ మాటూరి నాగార్జున మాట్లాడుతూ శైలజా అనే మహిళ కు స్క్రబ్ టైఫస్ ఉన్నట్లు నిర్ధారణ చేయబడింది. ఆమె మునుపటి పరిస్థితి అనేది సెప్టిక్ ఎన్సెఫలోపతి, అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్ (ఏ ఆర్ డీఎస్ ), అక్యూట్ కిడ్నీ ఇంజూరీ (ఏకేఐ), మోడరేట్ పల్మనరీ ఆర్టరీ హైపర్ టెన్షన్ (పీఏహెచ్ )తో కూడుకున్న తీవ్రమైన మిట్రల్ రెగర్జిటేషన్ (ఎంఆర్ )వంటి సమస్యలతో ముడిపడటం వల్ల మరింత క్లిష్టంగా మారిందని అన్నారు. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్ లో క్లినికల్ డైరెక్టర్ మల్టీడిసిప్లినరీ ట్రీట్మెంట్ విధానానికి తమ బృందం నాయకత్వం వహించారన్నారు. తమ వైద్య బృందం నెఫ్రాలజీ, హెమటాలజీ, కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ సంప్రదింపులతో సహా సరైన సంరక్షణను అందించడమే కాక ఇంట్రావీనస్ యాంటీబయాటిక్స్, సహాయ చర్యలను అందించడం జరిగిందన్నారు.శైలజా కోలుకోవడం పట్ల సంతోషిస్తున్నామని తెలిపరు. యశోద హాస్పిటల్ లోని తమ బృందం మల్టీడిసిప్లినరీ విధానాన్ని ఉపయోగించి అసాధారణమైన సంరక్షణను అందించడానికి కట్టుబడి ఉన్నారన్నారు. సంక్లిష్ట నిర్వహణలో సత్వర, సమన్వయంతో కూడిన వైద్య విధానాల ప్రాముఖ్యతను ఈ కేసు హైలైట్ చేస్తుందన్నారు. బహుళ అవయవ ప్రమేయంతో కూడిన స్క్రబ్ టైఫస్ వంటి వ్యాధుల పట్ల మా ఆరోగ్య సంరక్షణ నిపుణుల అంకితభావం, నైపుణ్యానికి ఈ కేసు నిదర్శనమ తెలిపారు. శైలజా దుండి చికిత్సకు బాగా స్పందించడమే గాక గణనీయమైన రోగ లక్షణ అభివృద్ధిని చూపించారని, ఆమె స్థిరమైన స్థితిలో, అధిక-ప్రోటీన్ కలిగిన ఆహారాన్ని, సూచించబడిన మందులను అనుసరించాలనే సలహాతో డిశ్చార్జ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ సిబ్బందితో పాటు మేనేజర్ ఎస్.రమేష్, అసిస్టెంట్ మేనేజర్ ఏ.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com